క్లుప్తంగా

తీజ్ పండుగను ఘనంగా నిర్వహిద్దాం



తీజ్ ఉత్సవాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న గోర్ బంజారా నాయకులు

కర్నూలు (అర్బన్): బంజారాల అతి ముఖ్యమైన తీజ్ పండుగను ఘనంగా నిర్వహిద్దామని గోర్ బంజారా నాయకులు ఎస్.నాగరాజు నాయక్ అన్నారు. శనివారం సత్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో తీజ్ ఉత్సవ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీజ్ పండుగను ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు 9 రోజుల పాటు జరపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గోర్ బంజారా నాయకులు రంగస్వామి నాయక్, సీమ కృష్ణ రాథోడ్ రామాంజి నాయక్, గణేష్ నాయక్, శంకర్ నాయక్, సేవ్య నాయక్, గోరియా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై అభిప్రాయ సేకరణ

కర్నూలు(సెంట్రల్): రేషన్ కార్డుదారులకు ఇంకా ఎలాంటి నిత్యావసరాలు అందజేస్తే బాగుంటుందో తెలియజేయాలని డీఆర్వో/ఇన్‌చార్జి జేసీ కె.మధుసూదన్‌రావు అధికారులను కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రేషన్ కార్డులకు అందజేయాల్సిన నిత్యావసరాలపై డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, గ్యాస్ డిస్ట్రిబూషన్ ఏజెన్సీలు, రైస్‌మిల్లర్లతో ఆయన సమావేశమై అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పౌరసరఫరాల ద్వారా బియ్యం, బ్యాళ్లు, చెక్కర ఇస్తున్నామని, ఇంకా ఏమైనా ఇస్తే బాగుంటుందో ప్రజలతో అభిప్రాయ సేకరణ చేసి నివేదించాలని ఆదేశించారు.అంతేకాక పౌరసరఫరాల శాఖ బలోపేతానికి కూడా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో డీఎస్ఓ కేవీఎస్ఎం ప్రసాదు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

కర్నూలు కల్చరల్: కర్నూలు కళాకారుల సేవా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రకాష్ నగర్‌లోని టంగుటూరు ప్రకాశం పంతులు పురపాలక పాఠశాలలో పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లను అందజేశారు. సేవా కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా, విశ్రాంత తహసీల్దార్లు రోషన్ అలీ, అజయ్‌కుమార్, మహిళా సంఘం నాయకులు సుమలత తదితరులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాద్రి విజయ్‌కుమార్‌కు అందజేశారు.

తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులపై దృష్టి పెట్టండి

కర్నూలు(సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జరుగుతున్న మనబడి - మన భవిష్యత్తు కార్యక్రమ పనులను తక్కువ డబ్బుతో పూర్తి చేయగలవాటిపై దృష్టి పెట్టాలని డీఈఓ శామ్యూల్ ఎంఈఓలకు సూచించారు. శనివారం జిల్లా విద్యా శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై డీఈఓ మండల విద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే వారం నుంచి విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లాల్లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై వ్యతిరేక ప్రకటనలు మీడియాలో ప్రచురితమైతే వెంటనే ఆయా ప్రాంతాలకు చెందిన అధికారులు ఖండనలు ఇవ్వాలన్నారు. వివిధ కేటగిరీల్లో ఉపాధ్యాయులకు ఇచ్చే అవార్డులకు ఈనెల 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని సీబీఎస్ఈ స్కూళ్లలో ఈనెల 10వ తేదీ నుంచి ఎఫ్ఏ-1 ఫార్మటివ్ అసెస్మెంట్ టెస్టు ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో డీఈఓ ఆఫీస్ ఏడీఈ శామ్యూల్‌పాల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్‌పై ఆకస్మిక తనిఖీలు

కర్నూలు (టౌన్): నగరంలో నిషేధిత ప్లాస్టిక్‌పై శనివారం నగర పాలక ఆరోగ్యశాఖ అధికారులు విస్తృతంగా దాడులు చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నగరంలోని అన్ని వాణిజ్య ప్రాంతాల్లో ఒకేసారి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయాల కార్యదర్శులు తనిఖీలు చేపట్టారు. 16 డివిజన్లలో మొత్తం 618 షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టి 215 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. విక్రయదారులకు రూ.50,250 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ వారం రోజులుగా నగరంలో ప్లాస్టిక్‌పై దాడులు కొనసాగిస్తున్నామన్నారు. దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమావేశాలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శనివారం ఆ సంస్థ కార్యాలయంలో జాతీయ సమితికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఈ సృష్టిలో ప్రతి జీవి కదలికకు ఎముకలు, కీళ్లు ఎంతో ముఖ్యం. ఒక చోట నుంచి మరో చోటుకు సంచరించాలంటే ఇవి ఎంతో ప్రధానం. అందులో మనిషి లాంటి జీవికి మరింత ముఖ్యం. జీవనశైలి కారణంగా ప్రస్తుతం మనిషి ఎముకలు, కీళ్లకు జబ్బు చేసింది. అధిక శాతం ఉన్న చోట నుంచి కదలకుండా డబ్బు సంపాదిస్తూ ఇదే సమయంలో రోగాలు కూడా ఆర్జిస్తున్నారు. కదలకుండా పనులు చేయడం వల్ల ఎముకలు, కీళ్లలో శక్తి తగ్గిపోతోంది. ఫలితంగా ఎముకలు, కీళ్ల వ్యాధులున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ వ్యాధులపై అవగాహన తీసుకురావడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 4వ తేదీన జాతీయ ఎముకలు, కీళ్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. - కర్నూలు (హాస్పిటల్)

అమ్మో .. కాళ్ల నొప్పి



- పెరుగుతున్న కీళ్లు, ఎముకల బాధితులు
- ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మందికి పైగా కీళ్ల సమస్యలు
- అధిక సమయం కూర్చుని పనిచేయడమే, వ్యాయమం చేయకపోవడమూ కారణం
- నేడు జాతీయ ఎముకలు, కీళ్ల దినోత్సవం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మోకాలి నొప్పులు (ఆస్టియో ఆర్థరైటిస్), కీళ్లవాతం(రుమటాయిడ్ ఆర్థరైటిస్)తో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో జనాభాలో 4 శాతం ఉన్న వీరి సంఖ్య ఇప్పుడు 6 శాతానికి చేరుకుంది. అంటే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రస్తుతం 3 లక్షల మందికి పైగా కీళ్లజబ్బులతో బాధపడుతున్నట్లు వైద్యుల అంచనా. మొదట్లో నగరాలు, పట్టణాల్లో మాత్రమే ఈ బాధితులు అధికంగా ఉండేవారు. ఇప్పుడు పల్లెల్లో కూడా పెరుగుతున్నారు. ఈ రెండు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో బీపీ, షుగర్ తర్వాత నొప్పులు, కాల్షియం మాత్రమే ఎక్కువగా వాడుతున్నట్లు అంచనా. శారీరక శ్రమ తగ్గిపోవడం, పోషకాహారం లోపించడం, జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ తినడం వంటి కారణాలతో కీళ్ల జబ్బులతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారిలో కీళ్ల సమస్య ఏర్పడేది. ఇప్పుడు పాతికేళ్ల వయస్సు నుంచే మోకాళ్లు, కీళ్లనొప్పులతో బాధపడే వారి సంఖ్య పెరిగింది. ఈ నొప్పులు తగ్గించుకునేందుకు గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని మురికివాడల్లో అధిక శాతం ఆర్ఎంపీలు, నకిలీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు నేరుగా మందుల దుకాణాలకు వెళ్లి నొప్పుల మాత్రలు కొని వాడుతున్నారు. దీర్ఘకాలం ఈ మాత్రలు వాడటం వల్ల ఎక్కువ శాతం కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. ఇదే సమయంలో కీళ్లనొప్పులు తగ్గిస్తామని, కీళ్లలో గుజ్జు పెంచే మందులు ఇస్తామంటూ నకిలీ ఆయుర్వేద మందుల గాళ్లు ఊరూరా తిరుగుతూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఇటీవల కాలంలో అల్లోపతిలోనూ కీళ్ల, కాళ్లనొప్పులపై కొంత మంది వైద్యులు ప్రయోగాలు చేస్తున్నారు. అన్ని రకాల ప్రయోగాలు చేసి చివరకు కీళ్ల మార్పిడి చేయించుకుంటున్నారు.



ఆస్టియో ఆర్థరైటిస్

కీళ్లు బలహీనపడటం, అరుగుదల కారణంగా ఆస్టియో ఆర్థరైటిస్ (మోకాలునొప్పి) వస్తుంది. కీళ్లలో ఉండే కార్టిలేజ్ అనే మృదువైన కుషన్‌లాంటి పదార్థం దెబ్బతినడం వల్ల కీళ్ల మధ్యలో ఉండే ఖాళీ స్థలం తగ్గి ఎముకలు ఒకదానితో ఒకటి రాసుకుంటాయి. ఈ క్రమంలో మోకాలులో నొప్పి, బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. 40 ఏళ్లు పైబడిన వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. కొందరిలో వంశపారంపర్యంగా, మరికొందరిలో ఎక్కువ బరువులు మోసేవారిలో ఈ సమస్య వస్తుంది.

రుమటాయిడ్ ఆర్థరైటిస్

ఇది దీర్ఘకాలిక వ్యాధి. మన శరీరంలోని వ్యాధి నిరోధక వ్యవస్థ వ్యతిరేక దిశలో పనిచేయడం వల్ల ఇది సంభవిస్తుంది. దీనివల్ల కీళ్లలో నొప్పి, వాపు, బిగువును కలుగజేస్తుంది. ఒకే సమయంలో శరీరం రెండువైపులా సమంగా కీళ్లనొప్పి కలుగుతుంది. కొన్ని వారాల్లో ఇది వృద్ధి చెందవచ్చు. మీ కీళ్లను నాశనం చేయడం ప్రారంభిస్తుంది. ఇది సాధారణంగా చెయ్యి, పాదం, మణికట్టు, మోచేయి, చీలమండలంలోని చిన్న కీళ్లను ప్రభావితం చేస్తుంది. దీనికి స్త్రీ, పురుష అన్న బేధం లేదు. అయితే పురుషులతో పోలిస్తే స్త్రీలలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. చికిత్స చేయకపోతే శాశ్వతంగా కీళ్లకు హాని కలుగజేస్తుంది.

కీళ్లజబ్బులున్న వారు ఇలా చేయాలి

వయస్సు మీద పడిన వారు ఎక్కువగా సమతులాహారాన్ని తీసుకోవాలి. ఎముక ఆరోగ్యానికి కావాల్సిన కాల్షియం, ప్రొటీన్లు కలిగిన ఆహారాన్ని తినాలి. వైద్యుల సూచన మేరకు నిర్ణీత కాలం పాటు కాల్షియం, విటమిన్-డీ మాత్రలు వాడాలి. బీపీ, షుగర్, అధిక బరువు ఉంటే వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. ఇందుకోసం నియమిత ఆహారం, మందులు తీసుకోవాలి. కండరాలు, ఎముకలను బలోపేతం చేసుకోవడానికి రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. దూమ, మద్యపానానికి దూరంగా ఉండాలి.

నొప్పుల మాత్రలతో కిడ్నీ సమస్యలు



కీళ్లనొప్పులతో బాధపడే వారు ఎక్కువగా నొప్పుల మాత్రలు వాడకూడదు. దీనివల్ల కిడ్నీలు దెబ్బతింటాయి. ఒక్కసారి కిడ్నీలు దెబ్బతింటే వాటిని బాగు చేసుకోవడానికి చాలా కష్టపడాలి. వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి. కీళ్ల నొప్పులు తగ్గించుకునేందుకు అవసరమైన వ్యాయామం, ఫిజియోథెరపీ చేయించుకోవాలి. ఎక్కువసేపు ఏసీ రూముల్లో కూర్చోకూడదు. అధిక బరువు వల్ల కూడా కీళ్లలో కార్టిలేజ్ కరిగిపోయి, ఎముకలు మెత్తబడతాయి.

– డాక్టర్ డాక్టర్ ఎల్. వెంకటపక్కిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, నెఫ్రాలజి విభాగం, జీజీహెచ్, కర్నూలు

ప్రతి రోజూ వ్యాయామం చేయాలి



ఇటీవల కాలంలో చిన్న వయస్సులోనే కీళ్ల వ్యాధులు, ఎముకల వ్యాధులు వస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే వారు ఎక్కువసేపు ఒకేచోట కూర్చుని పనిచేయడం, ఉదయం పూట వ్యాయామాలు చేయకపోవడం వల్ల ఎముకలు త్వరగా మెత్తబడుతున్నాయి. జీవనశైలి కారణంగా 40 ఏళ్లు దాటిన వారిలో త్వరగా మోకాళ్లనొప్పులు వస్తున్నాయి. ఇలాంటి వారు వైద్యుల సలహా, సూచనల మేరకు మందులు వాడుతూ వ్యాయామం చేస్తూ ఉండాలి. అవసరమైతే ఫిజియోథెరపీ చేయించుకోవాలి.

– డాక్టర్ సి. మంజునాథ్, ఎముకల వ్యాధుల నిపుణులు, కర్నూలు

బాస్కెట్‌బాల్ విజేతలు అథీనా, ఎస్‌డీఆర్



విజేతగా నిలిచి కప్ అందుకుంటున్న అథినా పాఠశాల బాలికల జట్టు

కర్నూలు (టౌన్): బాస్కెట్‌బాల్ విజేతలుగా అథీనా, ఎస్‌డీఆర్ పాఠశాలలు నిలిచాయి. రెండు రోజుల పాటు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న భూషణరావు మెమోరియల్ బాస్కెట్‌బాల్ ఉమ్మడి జిల్లా స్థాయి టోర్నమెంట్ శనివారం సాయంత్రం ముగిసింది. బాల, బాలికల విభాగంలో కర్నూలుకు చెందిన అథీనా పాఠశాల జట్టు ప్రథమ స్థానంలో, నంద్యాలకు చెందిన ఎస్‌డీఆర్ పాఠశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు డీఎస్పీ ప్రతాప్, ఏఎస్ఐ భూషణం మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువు, క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ సెల్‌ఫోను, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. టోర్నమెంటులో ప్రతిభ కనబరచిన ఆరుగురికి నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ కార్యదర్శి హెడ్ కానిస్టేబుల్ దాదాబాషా పాల్గొన్నారు.

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ విద్యార్థులకు అభినందన



నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌నకు ఎంపికైన వలంటీర్లతో వర్సిటీ వీసీ ఎన్‌టీకే నాయక్, తదిరులు

కర్నూలు కల్చరల్: నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌కు ఎంపికైన రాయలసీమ విశ్వవిద్యాలయం, అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులను వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అభినందించారు. శనివారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన భారత దేశంలో జాతీయ సమైక్యతను సాధించడానికి ఇలాంటి క్యాంప్‌లు ఎంతగానో సహకరిస్తాయన్నారు. వలంటీర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు కర్ణాటక మంగళూరు వర్సిటీకి అనుబంధంగా ఉన్న శ్రీ మహావీర్ కళాశాలలో జరిగే క్యాంప్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొంటారని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు మాట్లాడుతూ క్యాంప్‌కు వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పి.లోకేష్, వై.హేమలత, సెయింట్ జోసఫ్స్ మహిళా కళాశాల నుంచి కె.సుకన్య, ఎన్.చైతన్య, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల నుంచి బి.మెహరున్నీసా, ఎ.కె. హర్షవర్ధన్, ఎస్.సంపత్ సాగర్, ఆదోని ఆర్ట్స్ కళాశాల నుంచి ఎ.ఎస్. అబ్దుల్ ఖాదిర్, వి. పవన్ కుమార్, ఎ.తనుశ్రీ పాల్గొంటారన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ బి.వి.శివప్రసాద్ క్యాంప్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారన్నారు.

బేసిక్ మెడికల్ ఎడ్యుకేషన్ అవసరం

కర్నూలు(హాస్పిటల్): వైద్యవిద్యలో బోధకులుగా ఉన్న వారందరికీ బేసిక్ మెడికల్ ఎడ్యుకేషన్ కోర్సు అవసరమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో ఎన్ఎంసీ నిబంధనల మేరకు ఎంఈయూ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద ఆధ్వర్యంలో జరిగిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ కె. చిట్టినరసమ్మ మాట్లాడుతూ వైద్యులు నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వైద్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ అబ్జర్వర్ డాక్టర్ కవిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, ఎంఈయు సభ్యులు డాక్టర్లు విజయానందబాబు, లక్ష్మి, విశాల, గాయత్రి, అరుణ, కుముద, భానుప్రకాష్, డాక్టర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ అన్నారు. శనివారం ఆయన స్థానిక రోజా-1 యూపీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులు, రిపోర్టులు, ల్యాబ్ గదిని పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు గురించి వైద్యాధికారితో చర్చించారు. సుంకులమ్మ గుడి వీధిలో జరుగుతున్న లెప్రసీ సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేసి ఆశా, వలంటీర్ ద్వారా జరిగే సర్వే విధానాన్ని ప్రజలతో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా నీటి నిల్వలను తనిఖీలు నిర్వహించి లార్వాలు ఉన్నచో నీటిని పారబోసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని వార్డులను సందర్శించి ప్రజలను వారానికి ఒకసారి నీటి నిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమల పెరుగుదలను అరికట్టే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. తద్వారా దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ఉమా, డీఎంవో నూకరాజు, వైద్యాధికారి డాక్టర్ ఫాతిమా, డెమో శ్రీనివాసులు, డీపీవో విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని మాల సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు జేఏసీ సంఘాల నాయకులు కాసారపు వెంకటేష్, మద్రాస్ నాగరాజు, బి.రాజీవ్‌కుమార్ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కాకుండా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిల్ వేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించాలన్నారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లను రద్దు చేయడంలో భాగంగానే వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టులో వాదనాలు వినిపించిందన్నారు. కార్యక్రమంలో నాయకులుసుంకన్న, గోపీ, దస్తగిరి, నాగన్న పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కర్నూలు: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన పి.నరసింహయ్య (42) కర్నూలులో అదృశ్యమయ్యాడు. ఈయనకు మద్యం తాగే అలవాటు ఉండి అనారోగ్యంతో గత నెల 27వ తేదీ కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఆసుపత్రి నుంచి వెళ్లిపోయాడు. అతని కోసం భార్య సువర్ణ కర్నూలు అంతా గాలించినా కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 5.6 అడుగుల ఎత్తు ఉండి, చామన ఛాయ రంగు ఉంటాడు. అతను పారిపోయేటప్పుడు పసుపు, నీలం, ఎరుపు రంగు గల గీతల టీషర్టు, నల్లటి లుంగీ ధరించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. చేతికి సాయిబాబా వెండి ఉంగరం , సింధూరం రంగు కాశీ తాడు చేతికి ధరించాడు. భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

30 ఏళ్ల పోరాటం ఫలించింది

కర్నూలు (సిటీ): 30 ఏళ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించామని ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు పేరపోగు లక్ష్మన్న అన్నారు. శనివారం బి.తాండ్రపాడు గ్రామంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి టీజీ భరత్ చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం మాదిగలు ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రయోజనాల కోసం ఉమ్మడి పోరాటం చేయాలన్నారు.

కళాక్షేత్రం అభివృద్ధికి కృషి

కర్నూలు కల్చరల్: కళాకారులకు అండగా ఉండి, స్థానిక కళాక్షేత్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ రాజ్యసభ సభ్యులు, టీజీవీ కళాక్షేత్రం గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో టీజీవీ కళాక్షేత్రం శాశ్వత సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. కళాక్షేత్రం గౌరవ చైర్మన్‌గా టీజీ వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు కళాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కరోనా తరువాత కళాక్షేత్రం మొదటి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అంతకు ముందు టీజీవీ కళాక్షేత్రం సావనీర్‌ను ఆవిష్కరించారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, కేజీ గంగాధర్ రెడ్డి, దస్తగిరి, వీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

స్నేహం.. ఈ పదం ఆత్మీయం.. అనిర్వచనీయమైంది. స్పందించే గుండె ఉండాలే కానీ.. స్నేహం అనే పదం మహోన్నతమైంది. బంధుత్వం కన్నా ఒక్కోసారి రక్త సంబంధం కన్నా స్నేహ బంధమే విడదీయనిది. నిజమైన స్నేహం త్యాగాన్నే కోరుకుంటూ సహాయానికి నిలువెత్తు సాక్షిగా నిలుస్తుంది. కడగండ్ల జీవితంలో మోముపై చిరునవ్వుకు కారణమయ్యేది ఈ స్నేహమే. కారుచీకట్లు ముసురుకుంటున్న వేళ.. కాంతిరేఖగా వెలుగు పంచేవాడు 'స్నేహితుడు'. సరదాల కుర్ర ప్రాయానికి మరిన్ని తీపి సొబగులు అద్దేవాడు ఫ్రెండ్. ఆస్తుల్లేని యువత ఉండొచ్చు కానీ దోస్తుల్లేని వారు ఉండటం చాలా అరుదు. కాలాలెన్నీ మారినా.. కలకాలం నిలిచి ఉండేది స్నేహం. నేడు 'స్నేహితుల దినోత్సవం'. పలువురు స్నేహితులు తమ స్నేహానుభూతులను ఇలా పంచుకున్నారు. – కర్నూలు (కల్చరల్/హాస్పిటల్)



నేస్తం.. నీవే సమస్తం

అన్నదమ్ముల వలే ఉన్నాం



కర్నూలులోని రాజ విహార్ సెంటర్ సమీపంలో క్యాంటీన్ నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డితో నాకు 24 ఏళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మా స్నేహబంధం నిరంతరంగా కొనసాగుతోంది. నాకు సంబంధించిన ప్రతి అంశాన్ని శ్రీనివాసరెడ్డి దగ్గరుండి చూసుకుంటూ ఉన్నారు. ఇళ్ల స్థలాలు కొనాలన్నా, ఇంటి నిర్మాణం చేసుకోవాలన్నా సహకరించారు. నేను హైదరాబాద్, వైజాగ్‌కు బదిలీ అయితే అప్పుడు కూడా నాకు తోడుగా ఉన్నాడు. 24 ఏళ్లుగా మేం అన్నదమ్ముల వలే ఉన్నాం. అతని ఇంట్లో ఎవరికీ అనారోగ్యంగా ఉన్నా నన్ను సంప్రదిస్తాడు. శ్రీనివాసరెడ్డి కూడా ప్రతి సమస్యను నాతో పంచుకుంటారు.

–డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

వీరి స్నేహంలో రహస్యానికి చోటు లేదు



ఈ చిత్రంలోని ఇద్దరు స్నేహితుల్లో ఒకరు జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డీన్ డాక్టర్ ఎం.గిరిధర్ కుమార్, మరొకరు డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ ప్రొఫెసర్ జి.శశికుమార్. వీరు ఇద్దరు 1996లో రవీంద్ర విద్యా సంస్థల్లో ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి విద్యా సంస్థల్లోని విషయాలు, కుటుంబ సమస్యలు ఇలా ప్రతి విషయం ఒకరికొకరు చర్చించుకుంటూ పరిష్కరించుకుంటున్నారు. 27 ఏళ్ల స్నేహంలో ఇద్దరి మధ్య రహస్యమనేది లేదని వారు చెబుతున్నారు. ఉదయం మొదలు రాత్రి ఇంటికి వెళ్లే వరకు కలిసి ఉండాల్సిందే. కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఉద్యోగ ఉన్నతిలో ఒకరికొకరు మంచి సహకారం అందించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఉద్యోగంలో ఏ హోదాలో ఉన్నా ప్రొఫెషనల్ జెలసీ అనేది లేకుండా ఉన్నామని వారు చెబుతున్నారు. ప్రతి అంశంలో సహకారం ఉంటుంది. ఒకరి తెలిసిన విషయం మరు క్షణంలో స్నేహితునికి తెలియాల్సిందే. ఉద్యోగంలో చేరిందే మొదలు ఇద్దరం ఇలా ఉన్నామంటే మా మధ్య అమరికలు లేకుండా అన్ని విషయాలు పంచుకోవడమేనని అంటున్నారు.

చదువులో ఎంతో సహాయపడ్డాడు



నేను కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నప్పటి నుంచి డాక్టర్ సర్వోత్తమ్ పరిచయం. ఆయన ప్రస్తుతం కర్నూలులో రేడియాలజిస్టు. అప్పట్లో ఆయన, నేను కలిసి చదువుకునేవాళ్లం. కలిసి తిరిగేవాళ్లం. కలిసి భోజనం చేసేవాళ్లం. ముఖ్యంగా చదువు విషయంలో నాకు ఆయన ఎంతో హెల్ప్ చేశాడు. నాకు ఏదైనా సందేహాలు వస్తే తీర్చేవాడు. ఎంబీబీఎస్ తర్వాత పీజీ సీటు సాధించేందుకు ఒక సంవత్సరం గ్యాప్ వచ్చింది. పీజీ సీటు కోసం ప్రిపరేషన్ అయ్యే సమయంలో ఎంతో జాగ్రత్తలు చెప్పేవాడు. నాకు మానసికంగా ధైర్యం చెప్పి ప్రోత్సహించేవాడు. ఆయన వల్లే నేను సీటు సాధించానేమో. ఆయనతో అనుబంధం నాకు అలా ఉండేది.

– డాక్టర్ సి. వాసురెడ్డి, సర్జికల్ ఆంకాలజిస్టు, కర్నూలు